క్లుప్తంగా

పెద్దమ్మతల్లి వార్షికోత్సవానికి రండి



ఈటల రాజేందర్‌కు వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను, మొక్కను అందజేస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): మండలపరిధిలోని దుద్దెడలో త్వరలో జరిగే పెద్దమ్మ తల్లి దేవాలయ 5వ వార్షికోత్సవానికి రావాలని పార్టీలకతీతంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులను సోమవారం ముదిరాజ్ సంఘం సభ్యులు ఆహ్వానించారు. బీజేపీ నాయకులు ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధులకు పత్రిక అందజేసి ఆహ్వానించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.60 లక్షలు సీజ్



కొమురవెల్లి(సిద్దిపేట): వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారు నాగులబండ వద్ద కేంద్ర బలగాలతో కలిసి త్రీటౌన్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సిద్దిపేటకు చెందిన సుందరయ్య కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 2 లక్షలను తరలిస్తుండగా ఎస్సై విజయభాస్కర్ స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): లోకసభ ఎన్నికల సందర్భంగా మండలంలోని అయినాపూర్ శివారు చెక్‌పోస్టు వద్ద చేర్యాల కొమురవెల్లి ఎస్ఐ నాగరాజుతో సీఐ శ్రీను కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా తోర్నాలకు చెందిన ఆకుల యాదగిరి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకు పోతున్న రూ.60 వేలను సీజ్ చేశారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ ఎవరైన రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకు వెళ్లేటప్పుడు సరైన ఆధారాలు వెంట పెట్టుకోవాలని సూచించారు.

గరుడవాహన సేవ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీనర్సింహస్వామిని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పూజారులు మధుసూదనాచారి, శ్రీవాత్సవ, భక్తులు పాల్గొన్నారు.

నేడు శకటోత్సవం

బెజ్జంకి, లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శకటోత్సవం జరగనుంది. బెజ్జంకితో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు తమ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లు, ద్విచక్ర, భారీ వాహనాలను గుట్ట చుట్టూ తిప్పుతారు. అనంతరం తొలి పంటను నైవేద్యంగా స్వామికి సమర్పిస్తారు.

మైక్‌సెట్ విక్రయం?

చోద్యం చూస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ మైక్ సెట్‌ను సిబ్బంది విక్రయించారని ఆరోపణలు వినిపించాయి. గతంలో ఒక భక్తుడు మొక్కు కింద మైక్ సెట్ వితరణ ఇస్తే సిబ్బంది రికార్డులో నమోదు చేసి స్టోర్ రూంలో భద్రపరిచారు. ఇటీవల ఆలయానికి అనుసంధానమైన ఎల్లమ్మ గుడి వద్ద మైక్ సెట్ పాడైంది. ఒగ్గు పూజారులు అధికారులకు తెలిపారు. వారు పట్టించుకోలేదు. ఈ విషయమై మైక్‌సెట్ ఇన్‌చార్జికి రూ.6,500 అందుకున్నాడని సమాచారం. దీంతో మైక్ సెట్‌ను ఎల్లమ్మ ఆలయం వద్ద బిగించాడని తెలిసింది. దీనిపై ఈఓ బాలాజీని వివరణ కోరగా.. రెండు రోజుల క్రితమే నా దృష్టికి వచ్చిందన్నారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ రవికాంత్

దుబ్బాకరూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మండలంలోని రామక్కపేట గ్రామానికి చెందిన నర్సింహులుకు ఎస్ఐ రవికాంత్‌రావు సోమవారం అందజేశారు. కొన్ని రోజుల క్రితం ఫోన్‌ను అక్బర్‌పేటలో బాధితుడు పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను స్వాధీనం చేసుకొని ఎస్ఐ అందజేశారు.

ఎన్నాళ్లిలా?

ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొత్త మండలం ఏర్పాటు చేసినా నేటికీ సొంత భవనాలను నిర్మించలేదు. పైగా సరైనా సదుపాయాల్లేక ఉద్యోగులు, పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలు, మండలాల పునర్విభజనలో కొత్త మండలంగా అక్కన్నపేటను ప్రకటించారు. -అక్కన్నపేట(హుస్నాబాద్)



అద్దె భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయం



పాఠశాలలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని నాలుగు శిథిలావస్థకు చేరిన తరగతి గదులను మరమ్మతులు చేయించి అందులో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షపడితే చాలు కార్యాలయమంతా ఎక్కడ చూసినా శ్లాబు నుంచి నీరు కారుతుంటుంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు పక్కనే ఉండటంతో రోజూ ఏదో పనిపై ప్రజాపరిషత్ కార్యాలయానికి ఆయా గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. దీంతో నిత్యం రద్దీ హడావిడిగా ఉంటుంది.

అద్దె భవనంలో రెవెన్యూ కార్యాలయం

అక్కన్నపేట మండలంగా ఏర్పాటైనప్పటి నుంచి రెవెన్యూ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. ఇక్కడ అరకొర వసతుల నడుమ కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. భూముల రిజిస్ట్రేషన్, ఇతర పనుల కోసం వచ్చే ప్రజలకు, రైతులకు అటూ ఉద్యోగులకు అద్దె భవనంలో సరైన సౌకర్యాలు లేక కొట్టుమిట్టాడుతున్నారు. అలాగే వ్యవసాయ కార్యాలయం నేటికీ ఏర్పాటు చేయలేదు.

ఈ ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందా?

గత ప్రభుత్వం హయాంలో ఏర్పడిన అక్కన్నపేట మండలంలో కొత్త మండల కార్యాలయాల సముదాయం కోసం మూడేళ్ల కిందనే 387 సర్వే నంబర్‌లో దాదాపు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సేకరించారు. కానీ సమీకృత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. కేవలం పోలీస్‌స్టేషన్, మండల వనరుల భవనం(ఎంఆర్‌సీ) తప్ప.. అన్నీ ప్రభుత్వ కార్యాలయాన్నీ అద్దె, ఇతర భవనాల్లో అరకొర వసతుల మధ్యన కొనసాగుతున్నాయి. కొత్త మండల కార్యాలయ సముదాయ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- పేరుకే అక్కన్నపేట మండలం
- ప్రభుత్వ కార్యాలయాలన్నీ అద్దె, ఇతర భవనాల్లో కొనసాగింపు
- ఉద్యోగులకు తప్పని తిప్పలు
- నూతన నిర్మాణాలకు ముందుకు పడని అడుగులు
- ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి

నిధులు మంజూరు చేయాలి



కొత్త సమీకృత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ఏడేళ్లయినా అద్దె, ఇతర భవనాల్లో అరకొర వసతుల మధ్యన పరిపాలన కొనసాగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు పనుల మీద వెళ్లే ప్రజలు ఉద్యోగుస్తులు అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టి సారించి నిధులను మంజూరు చేయాలి. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాం.

– రామంచ మహేందర్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు, అక్కన్నపేట

కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు

కొండపాక(గజ్వేల్): ప్రధాని మోదీ ఆశీస్సులతో మెదక్ లోక్‌సభ స్థానానికి బరిలో నిలిచిన తనను గెలిపించాలని బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని దుద్దెడ, కొండపాకల్లో సోమవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పని చేస్తున్న బీజేపీని ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమిత్ షా సభకు తరలిరండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 25న పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే నిర్వహించనున్న బీజేపీ బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నట్లు బీజేపీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్ రావు తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు.

బీఆర్ఎస్‌కు చావుదెబ్బ తప్పదు

దుబ్బాక: మల్లన్నసాగర్ బాధితుల ఉసురు పోసుకున్న వెంకట్రామిరెడ్డిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి గుణపాఠం చెప్పాలని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. అంతకు ముందు పట్టణంలోని 16వ వార్డు పోలీస్‌స్టేషన్ వద్ద హనుమాన్ ఆలయంలో పూజలు చేసి ప్రచారం మొదలు పెట్టారు. కాగా, పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు పుల్లూరి రాజు బీజేపీలో చేరారు.



కొండపాక: దుద్దెడ రోడ్‌షోలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బీజేపీతోనే దేశాభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేష్‌గౌడ్ అన్నారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

గజ్వేల్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు, వడగళ్లతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 10 వేల పరిహారం చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందని గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి 4 నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ చెల్లిస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని విమర్శించారు.

ప్లాటు విషయంలో దాడి

ఐదుగురిపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: ఓ ప్లాటు విషయంలో జరిగిన గొడవలో ఐదుగురిపై కేసు నమోదైంది. ఈ సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గరికమొక్కల రాజేశ్.. రాఘవేంద్ర నగర్ కాలనీలో తనకున్న ప్లాట్‌లో అధికారుల అనుమతితో ఇళ్ల నిర్మాణం చేపట్టాడు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్‌లు ఈనెల 18న రాత్రి అనుచరులతో కలిసి వెళ్లి గృహాలు తమవేనని గొడవకు దిగారు. కేసు కోర్టులో ఉండగా నిర్మాణమెలా చేపడుతారని నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త దాడి చేసుకునే వరకు వెళ్లింది. శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తమ అనుచరులతో కర్రలతో తనపై దాడి చేసి, కారు అద్దాలు ధ్వంసం చేశారని, పిల్లర్ల దశలో ఉన్న నిర్మాణాన్ని సైతం జేసీబీతో కూల్చివేశారని వారిపై చర్యలు తీసుకోవాలని రాజేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఐదుగురిపై కేసు నమోదైంది. దర్యాప్తు జరుగుతోంది.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

వర్గల్(గజ్వేల్): సర్కారీ బడుల్లోని విద్యతో విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందుతుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు ఖాజా విరాహత్‌అలీ అన్నారు. ఆదివారం వర్గల్ మండలం అనంతగిరిపల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. హెచ్‌ఎం గీతారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నెంటూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కనకరాజు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

బండి సంజయ్ పూజలు

హుస్నాబాద్‌రూరల్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం మండలంలోని పందిల్లలో ఉన్న పెద్దమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేశారు. అర్చకులు పూజల అనంతరం ఆశీర్వాదించి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాంగోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల, ఎంపీటీసీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

పైపులు దగ్ధం

హుస్నాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పైపులు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐటీసీ భవనం వెనకాల గుర్తుతెలియని వ్యక్తులు ఎండిన చెత్తలో నిప్పు వేయగా మంటలు వ్యాపించి రైతు కొడముంజ దేవేందర్‌కు చెందిన పైపులకు అంటున్నాయి. కాగా తోటి రైతులు ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ సమాచారమిచ్చారు. ఫైరింజన్‌తో సహా సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. ప్రమాదం మూలంగా రూ.20వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

స్వాగత ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీని తొలగిస్తున్న ఎన్నికల సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలం బైరాంపల్లిలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలను ఎన్నికల అధికారులు సోమవారం తొలగించారు. బైరంపల్లిలో దుర్గామాత ప్రతిష్ఠా ఉత్సవాల్లో భాగంగా భక్తులకు స్వాగతం పలికేందుకు వివిధ పార్టీలకు చెందిన నేతలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సోమవారం మోడల్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) కింద తొలగించారు. ఎన్నికల నిబంధనలు దృష్ట్యా ఎలాంటి ఫ్లెక్సీలు, జెండాలు, గోడ రాతలు రాయకూడదని అధికారులు సూచించారు. ఉల్లంఘనులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

‘మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం’

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మెదక్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండే అని పీసీసీ సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మెదక్ లోక్‌సభ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా వెళ్లి పార్టీ ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ భారీ మెజారిటీతో గెలిచేలా అందరం సమైక్యంగా ముందుకు సాగుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలను మోసం చేశాయన్నారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో సైకిల్ యాత్ర చేస్తున్న వదిరి సతీష్ ముదిరాజ్‌ను సన్మానించారు. ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సూర్యవర్మ, పట్టణ మాజీ అధ్యక్షుడు చొప్పదండి చంద్రశేఖర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధు గెలుపునకు కృషి చేద్దాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపునకు కృషి చేద్దామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన వివిధ పార్టీల నాయకులు చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి అత్తు ఇమామ్, కౌన్సిలర్లు సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, రియాజుద్దీన్, సేవాదళ్ స్టేట్ కన్వీనర్ గుర్రం శ్రీనివాస్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్: మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు చంద్రం

కాంగ్రెస్‌తోనే రైతు సంక్షేమం

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని మాజీ మంత్రి హరీశ్‌రావు లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసం రైతుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలోనే వారు సంతోషంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

మతోన్మాద,అవకాశవాద పార్టీలను ఓడించండి : సీపీఎం

కొమురవెల్లి(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద, అవకాశవాద పార్టీలను ఓడించి, నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడే సీపీఎంను గెలిపించాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ పిలుపునిచ్చారు. భువనగిరి లోక్‌సభ పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు మద్దతుగా మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. దేశం వెనుకబాటు తనానికి కారణమైన కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, అత్తిని శారద, ఆరుట్ల రవీందర్, చంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

భూమాతను కాపాడుకుందాం

సిద్దిపేటఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడారు. సహజ వనరులను పొదుపుగా ఉపయోగించుకుని భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. మానవ తప్పిదాల వల్లే అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. సాంకేతికత పెరగడం వల్ల వినాశనం వైపు ప్రయాణిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి భూమాతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి విభాగాధిపతి విశ్వనాథం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ పుణ్యమ్మ, డాక్టర్ వైకుంఠం, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో సోమవారం ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు డ్రాయింగ్ ద్వారా చెట్టు, నీరు, భూమి, ప్లాస్టిక్ భూతముల వేషధారణలో కనిపించారు. ఈ భూమికి మనుషులు ఏ విధంగా హాని కలిగిస్తున్నారు.. ఎలా మనం కాపాడుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రహ్మ కుమారి సంస్థ నిర్వాహకురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కుదిరిన అవగాహన ఒప్పందం

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం... నిజామాబాద్ జిల్లా నందిపేటకు చెందిన స్మార్ట్ ఆగ్రో ఫుడ్ పార్క్ మధ్య సోమవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్.బి. నీరజప్రభాకర్, స్మార్ట్ ఆగ్రో ఫుడ్ పార్క్ సీఈఓ భట్టారామ్, డైరెక్టర్ శ్రీరామ్‌బత్తుల, సీనియర్ అడ్వయిజర్ అయ్యంగారు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, అభివృద్ధిలో సహకారం, పసుపులో పరిశోధన, అత్యుత్తమ నాణ్యమైన విత్తన పదార్థం అభివృద్ధి, పీజీ పరిశోధనకు గాను సౌకర్యాలను ఉపయోగించుకోవడం ఒప్పందం ముఖ్య ఉద్దేశమన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, కిరణ్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్, పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

3 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

కోహెడ(హుస్నాబాద్): ఇప్పటి వరకు 62 మంది రైతుల నుంచి 3 వేలు క్వింటాళ్ల ధాన్యం కొన్నామని ఏఈఓ రేఖ అన్నారు. మండల కేంద్రంలోని బాడుగుల చెరువు వద్ద ఐకేపీ ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 16 మందికి డబ్బులను ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలన్నారు.



నిర్వాహకులకు సూచనలిస్తున్న ఏఈఓ రేఖ

సంక్షిప్త వార్తలు

◆ వైభవంగా ప్రతిష్ఠ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బైరాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో సోమవారం ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు పార్నంది ఆంజనేయశర్మ, వైదిక నిర్వహణలో తొలిరోజు గణపతిపూజ, పుణ్యావాచనం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తిగుళ్ల రామ్మూర్తి శర్మ, రవీందర్‌శర్మ, దూసకంటి ప్రశాంత్‌శర్మ, ఎంపీటీసీ నందనబోయిన నర్సింహులు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీతోనే అభివృద్ధి

చిన్నకోడూరు(సిద్దిపేట): దేశం మరింత అభివృద్ధి సాధించాలంటే బీజేపీతోనే సాధ్యమని బీజేవైఎం మండల అధ్యక్షుడు మాతంగి నాగరాజు అన్నారు. బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం చిన్నకోడూరులో నూతన ఓటర్లతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, సురేందర్, రాజేష్, స్వామి, అశోక్, కృష్ణ, శేఖర్ తదితరులు ఉన్నారు.

◆ చేరికలు

జగదేవ్‌పూర్(గజ్వేల్) / కొండపాక(గజ్వేల్): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీఎస్పీలకు చెందిన 30 మంది కార్యకర్తలు సోమవారం పార్టీలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. దేశ అభివృద్ధి కోసం మూడోసారి ప్రధాని మోదీ గెలుపు కోసం మనమంతా పనిచేయాలన్నారు. మెదక్ సీటు గెలుపునకు మీరంతా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు సదానంద్‌గౌడ్, నాగరాజు, రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

◆ దిగజారుతున్న విలువలు



అక్కన్నపేట(హుస్నాబాద్): దేశంలో విలువలు రోజురోజుకూ దిగజారుతున్నాయని, వాటి పరిరక్షణలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి, నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జాగీరి సత్యనారాయణ, వీరన్ననాయక్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

◆ శోభాయాత్రకు తరలిరండి

చిన్నకోడూరు(సిద్దిపేట): హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేటలో నిర్వహించే శోభాయాత్రకు భారీగా తరలిరావాలని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బీ నరేష్ పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సిద్దిపేటలోని రంగదాంపల్లి హనుమాన్ దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై రూరల్ పోలీస్ స్టేషన్ దేవాలయం వరకు యాత్ర కొనసాగుతోందన్నారు. హనుమాన్ భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

◆ ఎండలో తిరగకుండా చూసుకోవాలి

కొండపాక(గజ్వేల్): ఎండలు ముదిరిన తరుణంలో విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలని ప్రిన్సిపాల్ నర్సింహ్మాచారి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో గల సోషల్ వెల్ఫేర్ జూనియర్ బాలుర కళాశాలలో విద్యా సంవత్సరం ముగింపును పురస్కరించుకొని సోమవారం పేరెంట్స్ కమిటీతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగామాట్లాడుతూ సెలవుల్లో తెలుగు, హిందీ, ఆంగ్లం చదవడం, రాయడం వంటివి చేసేలా చూసుకోవాలన్నారు. 5వ తరగతి ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజలను కాంగ్రెస్ మరోసారి మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బూత్ కో-ఆర్డినేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 5 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు.